క్లుప్తంగా

నగరపాలక వైద్యాధికారిగా రమేష్

కడప కార్పొరేషన్: కడప నగరపాలక సంస్థ వైద్యాధికారిగా డా. ఎస్ రమేష్ నియమితుల య్యారు. సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. చెత్త పన్నులు అనధికారికంగా వసూలు చేసిన వైనంపై ఇక్కడ మున్సిపల్ హెల్త్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న డా. చంద్రశేఖర్‌ను మాతృశాఖకు సరెండర్ చేశారు. అప్పటి నుంచి ఈ పోస్టు ఖాళీగా ఉంది. దీంతో జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్‌గా డా. ఎస్. రమేష్‌ను ఎంహెచ్‌ఓగా నియమిస్తూ డైరెక్టర్ ఆఫ్ హెల్త్, విజయవాడ వారు ఉత్తర్వులు జారీ చేశారు.

జూదరుల అరెస్ట్

కడప అర్బన్: కడప నగరంలోని చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శ్రీకృష్ణ దేవరాయకాలనీ సమీపంలోని కంపచెట్లలో జూదం ఆడుతున్న నలుగురు వ్యక్తులను సోమవారం చిన్నచౌక్ సీఐ ఓబులేసు ఆధ్వర్యంలో ఎస్ఐ ఎస్.రాజరాజేశ్వర్‌రెడ్డి తమ సిబ్బందితో వెళ్లి అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.12,130లు నగదుతో పాటు, 52 పేకముక్కలను స్వాధీనం చేసుకున్నారు.

కరస్పాండెంట్‌ను అరెస్టు చేయాలి

కడప సెవెన్‌రోడ్స్ : శ్రీ విజయదుర్గ నర్సింగ్ కళాశాల కరస్పాండెంట్ రమణారెడ్డిని తక్షణమే అరెస్టుచేయాలని ఆర్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు డీఎం ఓబులేశు యాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం ఈ మేరకు డీఆర్వోను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. సర్టిఫికెట్ల విషయంలో సరస్వతి అనే విద్యార్థినిని తీవ్ర పదజాలంతో దూషించిన కరస్పాండెంట్‌పై కేసు నమోదు చేయాలని కోరారు. తొలుత రూ. 15 వేలు ఫీజు అని చెప్పి కళాశాలలో చేర్చుకున్న తర్వాత రూ. 53 వేలు చెల్లించాలని కోరారన్నారు. అంత ఫీజు చెల్లించలేని విద్యార్థి రూ. 35 వేలు చెల్లిస్తామంటూ కరస్పాండెంట్ పాదాలు పట్టుకుని వేడుకున్నా వినకుండా దుర్భాషలాడారని తెలిపారు. మహిళా వేధింపుల చట్టం ప్రకారం ఆయనపై క్రిమినల్ కేసులు నమోదుచేయాలన్నారు. దీనిపై స్పందించిన డీఆర్వో డీఎస్పీకి రెఫర్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘ నాయకులు లంబోదర, జగన్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ వాహన మిత్ర అమలుచేయాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: అర్హులైన ప్రతి ఆటో కార్మికుడికి వాహనమిత్ర అమలు చేయాలని ఏఐటీయూసీ కడప జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్. నాగసుబ్బారెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆటో కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా కడప నగర కమిటీ ఆధ్వర్యంలో నగరంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మద్దిలేటి, నగర అధ్యక్షులు పిచ్చినేని సుబ్బారాయుడు, ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఏఐటీయూసీ అనుబంధం కడప నగర ప్రధాన కార్యదర్శి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

కబ్జాదారులపై కేసు నమోదు చేయాలి

కడప సెవెన్‌రోడ్స్ : కడప నగరం మృత్యుంజయకుంటలో రూ. 5 కోట్ల విలువైన ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసిన వారిపై తక్షణమే క్రిమినల్ కేసులు నమోదు చేసి, భూములు స్వాధీనం చేసుకోవాలని సీపీఐ నగర కార్యదర్శి ఎస్.వెంకట శివ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ పీజీఆర్ఎస్‌లో డీఆర్వో విశ్వేశ్వరనాయుడుకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో సీపీఐ నగర సహాయ కార్యదర్శి శంకర్ నాయక్, బ్రహ్మం, జయరామయ్య తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: కడప నగరంలో వర్షాలు పడడంతో సీజనల్ వ్యాధులు, విష జ్వరాలు విజృంభిస్తున్నాయని నగరంలో ఉన్న పట్టణ ఆరోగ్య కేంద్రాలకు రోగులు పెద్ద సంఖ్యలో వస్తున్నారని డాక్టర్లు అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సౌకర్యాలు కల్పించాలని సీపీఎం కడప నగర కార్యదర్శి ఏ.రామ్మోహన్ తెలిపారు. సోమవారం నగరంలోని అక్కాయపల్లిలో ఉన్న ప్రైమరీ హెల్త్ సెంటర్‌ను సీపీఎం నగర కమిటీ ప్రతినిధి బృందం పరిశీలించి అక్కడ ఉన్న రోగులతో మాట్లాడారు.

దేశం గర్వించదగ్గ ఇంజనీర్ విశ్వేశ్వరయ్య



మోక్షగుండం చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న పద్మశాలి ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు

కడప ఎడ్యుకేషన్: భారతదేశం గర్వించదగ్గ ఇంజనీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య అని పద్మశాలి ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు డా.గునిశెట్టి శ్రీనివాసులు అన్నారు. సోమవారం ఇంజనీర్స్ డే పురస్కరించుకుని కడపలోని ఆర్.ఆర్.అసోసియేట్స్ కార్యాలయంలో పద్మశాలి ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఇంజనీర్స్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మోక్షగుండం చిత్రపటానికి పద్మశాలి ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు డా.గునిశెట్టి శ్రీనివాసులుతో పాటు నాయకులు నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మోక్షగుండం ఎన్నో నిర్మాణాలు, కట్టడాలను నిర్మించారన్నారు. ఆయనను నేటి తరం ఇంజనీర్లు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అనంతరం కడప ఎస్పీడీసీఎల్ ఎస్ఈ చెన్నా శ్రీ రామచంద్రమూర్తి, డీఈ నరేంద్ర, ఆర్కిటెక్చర్ ఇంజనీర్ అవ్వారు రాజేష్‌ను సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో కడప లయన్స్ క్లబ్ సెక్రటరీ గునిశెట్టి సాయి కుమార్, మానవత కేంద్ర కమిటీ సభ్యులు రాటాలగోపి, మానవత నగర అధ్యక్షుడు సుబ్బరాయుడు మాట్లాడారు.

ఘనంగా ఇంజనీరింగ్ దినోత్సవం

భారతరత్న మోక్షగుండం జయంతిని ది ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇంజనీరింగ్ కడపశాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సభకు ముఖ్య అతిథిగా ఏపీ ట్రాన్స్‌కో చీఫ్ ఇంజనీరింగ్ డివి కృష్ణ కుమార్, గౌరవ అతిథులుగా సుధాకర్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వ్యక్తులు మాట్లాడుతూ దేశ నిర్మాణంలో ఇంజనీర్ల పాత్ర కీలకం అని కొనియాడారు.. అనంతరం వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో ఇనిస్టిట్యూషన్ ఆఫ్ ఇంజనీరింగ్ చైర్మన్ ఆదినారాయణరెడ్డి, గౌరవ కార్యదర్శి వెంకటేశ్వర్లు ఐఈఐ సభ్యులు, ఇంజనీరింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

తాగునీటి కోసం మహిళల ఆందోళన

చింతకొమ్మదిన్నె : మండల పరిధిలోని ఆజాద్ నగర్, హోమ్ గార్డ్ కాలనీ, చౌడేశ్వరీనగర్ కాలనీలకు రెండు రోజులుగా తాగునీరు రావడం లేదని సోమవారం చింతకొమ్మదిన్నె సచివాలయంలో మహిళలు నిరసన తెలిపారు. కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాలని ప్రజాప్రతినిధులకు, అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోయారు. సమీప ప్రాంతాల్లో బోర్లు వేశారని, కానీ మోటార్లు బిగించలేదని తెలిపారు. నీటి కోసం ఎన్నో ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి నీటి సమస్య పరిష్కరించాలని కోరారు. అనంతరం చింతకొమ్మదిన్నె ఎంపీడీఓ కుళ్లాయిబాబుకు వినతిపత్రం అందజేశారు.

చర్యలు తీసుకుంటాం

తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ తెలిపారు. స్థానిక అధికారులు, ఇంజనీరింగ్ సిబ్బందికి నీటి సమస్య ఉన్న ప్రాంతాల్లో పర్యటించి, మోటార్లకు మరమ్మతులు చేయాలని ఆదేశించారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

పెండ్లిమర్రి: వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలు తప్పని సరిగా పాటించాలని రూరల్ సీఐ చల్లని దొర అన్నారు. సోమవారం మండలంలోని వెల్లటూరు గ్రామ సమీపంలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన రికార్డు సక్రమంగా లేని వాహనాలకు జరిమానాలు విధించారు. అనంతరం మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కార్లు నడిపేవారు సీటు బెల్ట్ తప్పని సరిగా ధరించాలన్నారు. లైసెన్సులు లేకుండా వాహనాలు నడిపితే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. వాహనాల తనిఖీలో రికార్డులు లేని 10 వాహనాలకు రూ.11,500 జరిమానా విధించారు.

భారతీయుల బలీయమైన ఐక్యత శక్తి హిందీ

కడప సెవెన్‌రోడ్స్ : భారతీయులందరినీ ఐక్యంగా ఉంచే బలీయమైన శక్తి హిందీ అని ఎల్ఐసీ కడప సీనియర్ డివిజన్ మేనేజర్ జీకేఆర్‌వీ రవికుమార్ తెలిపారు. శనివారం స్థానిక డివిజనల్ కార్యాలయంలో 2025 సంవత్సర హిందీ పక్షోత్సవాలను ఆయన ముఖ్యఅతిథిగా జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించి మాట్లాడారు. మార్కెటింగ్ మేనేజర్ శ్యామ్ సుందర్ రావు, పర్సనల్ మేనేజర్ సత్య శ్రీనివాస్, ఎల్ఐసీ అధికారులు హరేంద్ర, రమేష్ బాబు, జి.బాబు పాల్గొన్నారు. తొలుత కేంద్ర హోం మంత్రి అమిత్ షా, ఎల్ఐసి చైర్ పర్సన్ దొరైస్వామి పంపిన హిందీ దినోత్సవ శుభాకాంక్షలను పద్మజా కుమారి, శ్రీవాణి చదివి వినిపించారు.

ప్రభుత్వ ఐటీఐ సమస్యలు పరిష్కరించాలి

కడప సెవెన్‌రోడ్స్ : కడప నగరంలోని ప్రభుత్వ ఐటీఐలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని పీడీఎస్‌వైఎఫ్ జిల్లా కన్వీనర్ ఒరుగంటి నాగేంద్ర బాబు కోరారు. సోమవారం పీజీఆర్ఎస్‌లో స్పెషల్ కలెక్టర్ రంగస్వామికి వినతిపత్రాన్ని సమర్పించారు. చిన్నపాటి వర్షం వచ్చినా కళాశాల ప్రాంగణం నీటితో నిండిపోతోందన్నారు. ఇందువల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. చాలా ఏళ్లుగా ఈ సమస్య పరిష్కారానికి నోచుకోలేదన్నారు. ప్రిన్సిపాల్ రత్నరాజు విద్యార్థుల విషయంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. నగర మంతటా వైరల్ జ్వరాలు ఉన్నాయని, వర్షం నీరు చేరడం వల్ల దోమలు వృద్ధి చెంది విద్యార్థులు అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు జమీర్, సంజీవరాయుడు, సుశాంత్, అజయ్‌కుమార్, సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఐక్య పోరాటాలతోనే సమస్యల పరిష్కారం



సభలో మాట్లాడుతున్న యూనియన్ ప్రధాన కార్యదర్శి లక్ష్మీదేవి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఐక్య పోరాటాలతోనే అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలు పరిష్కారమవుతాయని సీఐటీయూ నాయకులు, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నేతలు తెలిపారు. ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా 9వ మహాసభలు స్థానిక యూటీఎఫ్ భవన్‌లో నిర్వహించారు. మహాసభల ప్రారంభంలో యూనియన్ నాయకురాలు ఆర్ లక్ష్మీదేవి జెండా ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన సభలో యూనియన్ ప్రధాన కార్యదర్శి లక్ష్మీదేవి మాట్లాడుతూ అంగన్వాడి ఉద్యమాన్ని బలోపేతం చేసుకుని పోరాటాలు చేసి సమస్యలు సాధించుకోవాలన్నారు. అంగన్వాడీలను కార్మికులుగా గుర్తించి కనీస వేతనాలు అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్నాయన్నారు. పేదవారి సంక్షేమం కోసం అహర్నిశలు శ్రమిస్తున్న అంగన్వాడీలపై విపరీతమైన పని భారాన్ని మోపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షులు కామనూరు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ వేతనాల పెంపు కోసం ఐక్య పోరాటమే మార్గమని తెలిపారు. గతంలో 42 రోజుల పాటు అంగన్వాడీలు సమ్మె చేసినప్పుడు ప్రస్తుత కూటమి నాయకులు ప్రతిపక్షంలో ఉండి మద్దతిచ్చారని గుర్తు చేశారు. సమస్యలు పరిష్కరిస్తామని, వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చారని అన్నారు. ఆ హామీలు ఇప్పుడు అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి నివేదికలో గత మూడేళ్లలో జరిగిన పోరాటాలు చర్చించారు. 42 రోజుల సమ్మె ఫలితంగా అనేక జీఓలు సాధించుకున్నామని తెలిపారు. రాబోయే కాలంలో జిల్లాలో ఉద్యమాన్ని మరింత బలపర్చాలని చెప్పారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి కె.సత్యనారాయణ, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు. అనంతరం 53మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు.

ప్రకృతి వ్యవసాయ విస్తరణకు కృషి చేయాలి



సమావేశంలో సూచనలు ఇస్తున్న ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజన్ ప్రవీణ్ కుమార్

కడప అగ్రికల్చర్: జిల్లాలో ప్రకృతి వ్యవసాయ విస్తరణకు సిబ్బంది కృషి చేయాలని ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ ప్రవీణ్‌కుమార్ సూచించారు. సోమవారం కడప ప్రకృతి వ్యవసాయ కార్యాలయ సమావేశ మందిరంలో సిబ్బందికి ప్రకృతి వ్యవసాయం విస్తరణ కార్యాచరణ ప్రణాళికపై ఒక రోజు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన ప్రకృతి వ్యవసాయం ముందుకు తీసుకెళ్లడానికి చేయవలసిన ప్రణాళిక మీద సూచనలు. సలహాలను ఇచ్చారు. రైతులతో చేయించాల్సిన వివిధ పంటల నమూనాలను, సిబ్బంది తమ సొంత పొలాల్లో చేయవలసిన వివిధ ఏ గ్రేడ్ పంటలు నమూనాల గురించి వివరించారు. అదే విధంగా ఫార్మర్ మాస్టర్ ట్రైనర్ కి ఉండవలసిన అర్హతలు గురించి తెలియజేశారు. రైతులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి పురుగు తెగుళ్ల గుర్తించి వాటికి సస్యరక్షణ పద్ధతులు తెలియజేయాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

భూములు ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు దండు వీరయ్య మాదిగ

కడప రూరల్ : దళితులు, పేదల భూములను ఆక్రమించుకున్న అగ్రవర్ణాలపై తగిన చర్యలు చేపట్టి బాధిత వర్గాలకు తగిన న్యాయం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు దండు వీరయ్య మాదిగ డిమాండ్ చేశారు. సోమవారం కడప నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భూ ఆక్రమణలపై తాము ఇదివరకు ప్రభుత్వంతోపాటు జిల్లా అధికార యంత్రాంగానికి ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు చేపట్టపోవడం బాధాకరమన్నారు. తాజాగా మైదుకూరు మండలం జాండ్లవరం గ్రామంలో సంబటూరు ప్రసాద్‌కు ప్రభుత్వం భూమిని కేటాయించగా, వాటిని సాగు చేసుకున్న తరుణంలో అగ్రవర్ణాలు దౌర్జన్యపూరితంగా వ్యవహరించడం ఏమాత్రం సమంజసం కాదన్నారు. బాధితుల ఫిర్యాదుల మేరకు కేసులు నమోదవుతున్నా సంబంధిత వ్యక్తుల నుంచి భూములను మాత్రం స్వాధీనం చేసుకోకపోవడం సరికాదన్నారు. రెవెన్యూ యంత్రాంగం 1977 పీఓటీ యాక్టును అమలు చేసి దళితుల భూములను ఆక్రమించిన వారిపై తక్షణమే చర్యలు చేపట్టాలని కోరుతున్నామన్నారు. దళితుల భూములకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత కలెక్టర్‌పై ఉందని ఆయన వివరించారు. ఇప్పటికైనా జిల్లా అధికార యంత్రాంగం దళితుల భూముల రక్షణకు తక్షణ చర్యలు చేపట్టాలని, బాధిత దళితులకు తగిన న్యాయం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ఆంజనేయులు, ఓబులేశు, రమణ తదితరులు పాల్గొన్నారు.

సమాజ ఉపయోగ కార్యక్రమాలు నిర్వహించాలి

కడప ఎడ్యుకేషన్: సమాజ ఉపయోగ కార్యక్రమాలను సేవా పథకం యూనిట్ ద్వారా నిర్వహించాలని యోగివేమన విశ్వ విద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య పుత్తా పద్మ అన్నారు. సోమవారం యోగివేమన విశ్వవిద్యాలయం జాతీయ సేవా పథకం యూనిట్- 9 ప్రోగ్రాం ఆఫీసర్ డా. కె . శ్రీనివాస రావు ఆధ్వర్యంలో చింతకొమ్మదిన్నె మండలం, శివాజీ నగర్‌లో ఏడు రోజుల ప్రత్యేక శిబిరాలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి పద్మ హాజరై మాట్లాడుతూ విశ్వవిద్యాలయ పరిధిలోని కాలేజీల్లో 70 ఎన్ఎస్ఎస్ యూనిట్లు మాత్రమే ఉండేవని, ఇప్పుడు 100 యూనిట్లకి పైగా అభివృద్ధి చెందడం గొప్ప విశేషమన్నారు. ఈ వారం రోజుల క్యాంపులో స్వచ్ఛభారత్, స్వచ్ఛ ఆంధ్ర , స్టేట్ ఎండ్ నేషనల్ వెల్ఫేర్ స్కీమ్స్ పై అవగాహన కల్పించడం, మొక్కలు నాటడం వంటి కార్యక్రమాలు నిర్వహించాలని ప్రోగ్రాం ఆఫీసర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కడప జిల్లా సమన్వయకర్త డాక్టర్ వెంకట రామారెడ్డి , శివాజీ నగర్ పాఠశాల హెడ్ టీచర్ సరస్వతి, జ్యోతి, కంప్యూటర్ సైన్స్ ఫ్యాకల్టీస్ సి. నారాయణ రెడ్డి , ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

ముస్లింలపై కక్షసాధిస్తున్న ప్రభుత్వం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం కడప నియోజకవర్గ అధ్యక్షుడు షఫీ

కడప కార్పొరేషన్: ముస్లిం, మైనార్టీలపై కూటమి ప్రభుత్వం కక్షసాధిస్తోందని వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం కడప నియోజకవర్గ అధ్యక్షుడు ఎస్ఎండీ షఫీ అన్నారు. సోమవారం మాజీ డిప్యూటీ సీఎం కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పదహారు నెలలవుతున్నా ఎన్నికల ముందు ముస్లింలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా ప్రభుత్వం నెరవేర్చలేదన్నారు. ఇమామ్‌లు, మౌజన్లకు 12 నెలలుగా గౌరవ వేతనాలు ఇవ్వలేదని, గౌరవ వేతనం రాకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గత సోమవారం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర వ్యాప్త పిలుపు మేరకు జిల్లా కలెక్టర్లకు వినతి పత్రాలు సమర్పించినా ప్రభుత్వంలో చలనం లేదన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు 50 ఏళ్లకే పింఛన్ ఇస్తామన్న హామీని ఇంతవరకూ అమలు చేయలేదన్నారు. హజ్‌యాత్రీకులకు లక్ష రూపాలయ ఆర్థిక సాయం చేస్తామన్నారని, ఏ ఒక్క హజ్ యాత్రికుడికి సాయం చేసిన పాపాన పోలేదన్నారు. దుల్హన్ పథకం కింద పెళ్లిళ్లు చేసుకునే పేద యువతులకు లక్ష రూపాయల ఆర్థిక సాయం చేయలేదన్నారు. మసీదుల నిర్వహణకు రూ.5వేలు ఇస్తామని హామీ ఇచ్చారని, చిన్న వ్యాపారస్తులకు రూ.5లక్షలు ఇస్తామని చెప్పి ఇవ్వలేదన్నారు. ఇప్పటికైనా వీటి అమలుకు శ్రీకారం చుట్టాలని డిమాండ్ చేశారు. ఈ హామీల అమలుకు వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో పోరాటం చేస్తామన్నారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ మైనార్టీ నాయకులు గౌస్ చాక్లెట్, ఎస్ఏ అక్బర్, డిష్ జిలాన్, పవర్ అల్తాఫ్, షఫీవుల్లా, అహ్మద్, డీజీ అక్బర్, జమీల్, అరీఫుల్లా బాషా, అతావుల్లా పాల్గొన్నారు.

వలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలి

కడప సెవెన్‌రోడ్స్ : వలంటీర్ల సమస్యలకు అసెంబ్లీ సమావేశాల్లో చర్చించి వారిని విధుల్లోకి తీసుకోవాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పెద్దుళ్లపల్లె ప్రభాకర్ కోరారు. ఈ మేరకు డీఆర్వోను కలిసి ఆయన వినతిపత్రాన్ని సమర్పించారు. విధుల్లోకి తీసుకోవడంతోపాటు గౌరవ వేతనం రూ. 10 వేలకు పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ప్రభుత్వానికి, ప్రజలకు వారధిలా పనిచేసిన వలంటీర్ల వ్యవస్థను కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రక్కన పెట్టిందన్నారు. ఎన్నికలకు ముందు రూ. 10 వేలు ఇస్తామని హామీ ఇచ్చిన కూటమి నాయకులు ఇప్పుడు అందుకు విరుద్ధంగా వ్యవహరించడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి శివనాగేంద్ర, వలంటీర్ అసోసియేషన్ నాయకులు సుబ్బారెడ్డి, ఇషాక్ అహ్మద్, అహ్మద్, రాము, శ్రీను, వీరాంజనమ్మ, ఏఐవైఎఫ్ నాయకులు అరుణ్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి

కడప ఎడ్యుకేషన్: ఉపాధ్యాయులకు సంబంధించిన సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణం పరిష్కరించాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఖాదర్‌బాష డిమాండ్ చేశారు. ఏపీటీఎఫ్ నిరసన కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్రీట సంఘం ×నిరసన వారం లో భాగంగా 5వ రోజు కడప పాత తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసనను చేసి తహశీల్దార్ నారాయణరెడ్డికి ఏపీటీఎఫ్ నాయకులు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను తక్షణం విడుదల చేయాలన్నారు. దీంతోపాటు యాప్‌లను, అసెస్‌మెంట్ బుక్‌లెట్ విధానాలను రద్దు చేసి ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా అధ్యక్షులు జి. గురవయ్య , జిల్లా ఉపాధ్యక్షులు నరసింహులు, రాజారావు, సుబ్బారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, మస్తాన్ బాబు, చిన్న గురవయ్య , రామచంద్రరెడ్డి, నాగన్న, దేవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాలను కాపాడాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: కడప నగరంలో వై జంక్షన్ దగ్గర ఉన్న ప్రభుత్వ స్థలాన్ని కొంతమంది భూకబ్జాదారులు ఆక్రమించుకున్నారని వాటిని అధికారులు కాపాడాలని సీపీఎం నగర కార్యదర్శి రామ్మోహన్ పేర్కొన్నారు. సోమవారం నగరంలో కబ్జాకు గురైన ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప నగరంలో కోట్లాది రూపాయల ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురవుతున్నాయని, వాటిని పరిరక్షించాల్సిన బాధ్యత రెవెన్యూ అధికారులపై ఉందని తెలిపారు. వై జంక్షన్ దగ్గర ఉన్న తొమ్మిది సెంట్ల స్థలం రూ.5 కోట్ల విలువ చేసే ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేస్తుంటే రెవెన్యూ యంత్రాంగం నిద్రపోతున్నదా అని ఆయన ప్రశ్నించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు సత్యనారాయణ చారి, దస్తగిరి రెడ్డి, నగర కమిటీ నాయకులు చంద్రారెడ్డి , విశ్వనాథ్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.


యూరియా కొరతపై ఆందోళన

కడప సెవెన్‌రోడ్స్ : రాష్ట్రంలో నెలకొన్న యూరియా కొరతపై కాంగ్రెస్ పార్టీ సోమవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన నిర్వహించింది. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల లక్షలాది మంది రైతులు కష్టాల్లో ఉన్నారని తెలిపారు. కీలక సమయంలో యూరియా లేక పంట దిగుబడులపై ప్రభావం చూపుతోందన్నారు. ప్రభుత్వం వెంటనే తగు చర్యలు తీసుకుని యూరి యా సరఫరా చేయకపోతే తమ పార్టీ రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు నిర్వహిస్తుందన్నారు. యూరియా బ్లాక్ మార్కెట్‌ను అరికట్టాలన్నారు. కార్యక్రమంలో కిసాన్ సెల్ అధ్యక్షులు గంటా చిన్నరామిరెడ్డి, నాయకులు ధ్రువకుమార్‌రెడ్డి, సిరాజుద్దీన్, సయ్యద్ గౌస్‌పీర్, అశోక్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికులను మానుకోవాలనడం తగదు

కడప వైఎస్ఆర్ సర్కిల్: జిల్లాలో మధ్యాహ్న భోజన పథకంలో స్మార్ట్ కిచెన్స్ ఏర్పాటులో కార్మికులకు ఎలాంటి అన్యాయం జరగదని కూటమి ప్రభుత్వం ఓ పక్క చెబుతున్నా అందుకు విరుద్ధంగా చింతకొమ్మదిన్నె మండల విద్యాశాఖ అధికారి వ్యవహరిస్తున్నారని ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరీ కేసి బాదుల్లా పేర్కొన్నారు. సోమవారం నగరంలోని విద్యాశాఖ కార్యాలయంలో విద్యాశాఖ అధికారి శంషుద్దీన్‌కు మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ నాయకురాళ్ళు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొలుములపల్లె ప్రభుత్వ పాఠశాలలో 2003 సంవత్సరం నుంచి మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న లక్ష్మీదేవి, జయమ్మ లను అర్ధాంతరంగా ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా మానుకోవాలని చెప్పడం మండల విద్యాశాఖ అధికారికి తగదన్నారు. విచారణ జరిపించి కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కామాక్షి, వర్కింగ్ ప్రెసిడెంట్ మేరీ, కోశాధికారి పార్వతి, లక్ష్మీదేవి, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

రిమ్స్ పీజీ వైద్య విద్యార్థుల ప్రతిభ



బి.సుధేష్ణ, జె.వి.అర్షకు సర్టిఫికెట్ అందిస్తున్న ప్రిన్సిపాల్ జమున

కడప అర్బన్ : కడప నగర శివారులోని ప్రభుత్వ వైద్య కళాశాల (రిమ్స్)లో పీజీ చేస్తున్న ఇద్దరు వైద్య విద్యార్థులకు వివిధ కేటగిరీల్లో బహుమతి లభించింది. సోమ వారం తమ చాంబర్‌లో వారిని ప్రిన్సిపాల్ టి.జమున అభినందించారు.

- కర్నూలు ప్రభుత్వ వైద్య కళాశాలలో ఈ నెల 12, 13, 14 తేదీల్లో జరిగిన ఏడవ ఏపీఎం ఏపీ స్టేట్ కాన్ఫరెన్స్‌లో కడప ప్రభుత్వ వైద్య కళాశాల పెథా లజీ మొదటి సంవత్సరం పీజీ విద్యార్థిని డాక్టర్ వి.జె.అర్ష తమ గైడ్, ప్రొఫెసర్ డాక్టర్ డి.కళ్యాణి మార్గదర్శకత్వంలో ప్రజెంట్ చేసిన పోస్టర్ ప్రజెంటేషన్‌కు మొదటి బహుమతి లభించింది.
- మంగళగిరి ఎయిమ్స్‌లో సెప్టెంబర్ 13, 14 తేదీల్లో ఏపీ ఏఆర్ఓఐసీఓఎన్-2025 రాష్ట్ర రేడియేషన్ ఆంకాలజిస్టుల సదస్సులో కడప ప్రభుత్వ వైద్య కళాశాలకు చెందిన ద్వితీయ సంవత్సరం రేడియేషన్ ఆంకాలజిస్ట్ పోస్ట్ గ్రాడ్యుయేషన్ విద్యార్థిని డాక్టర్ బి. సుధేష్ణ తమ గైడ్ డాక్టర్ ప్రవీణ మార్గదర్శకత్వంలో చేసిన ప్రాజెక్టుకు ద్వితీయ బహుమతి అందుకున్నారు.